ప్రజాశక్తి



ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

గార : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని వాడాడలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి నేరుగా రోగుల ఇంటి వద్దకే వైద్యులను పంపించి వైద్యం అందిస్తున్నామన్నారు. ఇటువంటి సౌలభ్యం ఏడున్నర దశాబ్దాల్లో ప్రజలకు అందుబాటులోకి రాలేదని చెప్పారు. ఈ సౌకర్యాన్ని అందిస్తున్న జగన్ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలతో పాటు ప్రజలకు ఉచితంగా మందులనూ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వైద్యులు శెట్టి పద్మావతి, ఆర్.మనోజ్, సర్పంచ్ సుంకాన సురేష్, తేజ, ఎం.ఎల్.బి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఒడిదుడుకుల్లో వ్యవసాయం

- దశాబ్ద కాలంగా జిల్లాలో పంటల సాగు తగ్గుముఖం
- దీర్ఘకాలం పెండింగ్‌లో సాగునీటి ప్రాజెక్టులు
- పెరగని ఆయుకట్టు
- బీడుగా మారుతున్న వేలాది ఎకరాలు



జిల్లాలో పంటల సాగు ఏటా తగ్గుతూ వస్తోంది. కరువు, తుపాన్లు, వరదల వంటి విపత్తులతో నిమిత్తం లేకుండా సేద్యం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా ఐదేళ్ల పంటల సాగు ప్రాతిపదికగా సాధారణ సాగు విస్తీర్ణాన్ని నిర్ణయిస్తారు. ప్రతి ఏడాది పంటల సాధారణ సాగు విస్తీర్ణం పడిపోతుండగా, అందులో వేలాది ఎకరాలు బీడు భూములుగా మరుతున్నాయి. భూములు సాగుకు యోగ్యంగా ఉన్నా, రైతులు పంటలు వేయలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. దశాబ్దకాలంగా జిల్లాలో కొత్తగా సాగునీటి వనరులను సృష్టించలేకపోవడం ఈ పరిస్థితికి దారితీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేకపోవడం, వాటిని సకాలంలో పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లేకపోవడంతో ఈ దుస్థితి తలెత్తుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో పంటల సాగు ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో క్రమేణా తగ్గుతూ వస్తోంది. సాగు నీటి సౌకర్యం లేకపోవడంతో పంటల సాగుకు భూమి వినియోగం తగ్గుతోంది. జిల్లా ప్రణాళికా విభాగం గణాంకాలు సాగు తగ్గుదలను స్పష్టం చేస్తున్నాయి. 2014-15 లెక్కల ప్రకారం జిల్లా భౌగోళిక విస్తీర్ణం 50,250 ఎకరాలు కాగా, అందులో 1,71,603 ఎకరాల మేర అటవీ భూమి ఉంది. సాగుకు యోగ్యం కాని భూమి 48,408 ఎకరాలుగా ఉంది. పంటల సాగుకు అనువైన భూమి 10,47,660 ఎకరాలు ఉన్నా, నికరంగా పంటలు 7,59,735 ఎకరాల్లో సాగవుతున్నాయి. పంటల సాగుకు అనువైన భూమి ఉన్నా 72.52 శాతం తగ్గింది. జిల్లా ప్రణాళికా విభాగం చివరిసారిగా సేకరించిన 2019-20 లెక్కల ప్రకారం సాగుకు యోగ్యమైన భూమి 10,84,133 ఎకరాలు ఉండగా, నికరంగా 7,64,285 ఎకరాల్లో పంటల సాగవుతున్నాయి. అంటే సాగుకు అనువుగా ఉన్న భూమిలో 70.50 శాతం మాత్రమే వినియోగంలోకి వచ్చింది. మిగిలిన భూమి నిరుపయోగంగానే ఉంది. ఐదేళ్ల కాలంలో సాగునీటి సౌకర్యమూ పెద్దగా పెరిగిందేమీ లేదు. 2014-15లో పలురకాల సాగునీటి వనరుల ద్వారా 4.55 లక్షల ఎకరాల భూమి వినియోగంలోకి రాగా, 2019-20 నాటికి 4,74,250 ఎకరాలకు సాగునీరు అందింది.

తొమ్మిదేళ్ల కాలంలో పంటల సాగు పరిస్థితి ఇలా...

సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2015	5,97,503
2016	5,84,705
2017	5,45,406
2018	4,53,693
2019	4,28,203
2020	3,72,883
2021	3,63,088
2022	3,66,113
2023	3,81,833

సాగునీటి వనరులు లేకే...

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్లే వేలాది ఎకరాలు నిరుపయోగంగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధార ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1,48,230 ఎకరాలు, రెండో దశ ద్వారా 62,280 ఎకరాలకు నీరందించాలని నిర్ణయించినా ఏనాడు లక్ష్యం మేర సాగునీరందించలేదు. వంశధార ఫేజ్-2 స్టేజ్-2 నిర్మాణ పనులు 2006లో ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. ప్రాజెక్టు పూర్తయితే రెండు లక్షల ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణతో పాటు రబీకి నీరందించే అవకాశం ఉంది. ఆఫ్‌షోర్ పూర్తయితే 24,600 ఎకరాల ఆయుకట్టుకు నీరందేది. 2007లో రూ.127 కోట్లతో ప్రారంభమైన రిజర్వాయర్ పనులు ప్రస్తుతం రూ.852 కోట్లకు చేరింది. ఇప్పటివరకు 48 శాతం పనులు మాత్రమే జరిగాయి. పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. తోటపల్లి కొత్త ఆయుకట్టు ద్వారా 38,974 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా 24,925 ఎకరాలకే సాగునీరు ఇస్తున్నారు. గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస రిజర్వాయర్ రెండో దశ పథకం కింద సుమారు 25 వేల ఎకరాల వరకు సాగు నీరందించేందుకు 2009లో పనులు ప్రారంభించినా, ఇప్పటికీ కాలువల నిర్మాణానికి భూసేకరణ పెండింగ్‌లో ఉంది.

మినీ రిజర్వాయర్లపైనా 'చిన్న'చూపే

కంచిలి మండలం జలంత్రకోట వద్ద జలంత్రకోటను మినీ రిజర్వాయర్‌గా మార్చేందుకు 2018లో పరిపాలనా అనుమతులు జారీ చేశారు. రిజర్వాయర్ పూర్తయితే సమీపంలోని 845 ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంది. రిజర్వాయర్ 2019లో పూర్తి కావాల్సి ఉన్నా, ఇప్పటికీ 44.50 శాతం మేర పనులే పూర్తయ్యాయి. ఎల్ఎన్‌పేట మండలం జంబాడ వద్ద కడగండి రిజర్వాయర్ నిర్మించి 364 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2016లో పరిపాలనా అనుమతులు జారీ చేశారు. 2017లోనే పూర్తి కావాల్సి ఉన్నా, నేటికీ 38 శాతం మాత్రమే పనులు జరిగాయి. మందస మండలం రాయికిల్లోయిగెడ్డకు అడ్డంగా కొత్త చిన్ననీటిపారుదల చెరువును నిర్మించి సమీపంలోని 869 ఎకరాలకు సాగునీరు అందించాలని 2003లో ప్రతిపాదించారు. ఇప్పటికీ పనులకు అతీగతి లేదు. ఇలా సాగునీటి ప్రాజెక్టులు, మినీ రిజర్వాయర్లు సకాలంలో పూర్తి కాకపోవడంతో, వేలాది ఎకరాలు సాగులోకి రాని పరిస్థితి నెలకొంది.

ఒపికి ఒటిపి చిక్కులు

వృద్ధులు, గ్రామీణ ప్రజలకు తప్పని కష్టాలు



ఒపి కోసం వరుసలో ఉన్న రోగులు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యం సేవలు పొందాలంటే ఇకపై సెల్‌ఫోన్ ఉండాల్సిందే. ఒపి చీటీ కావాలంటే ఒటిపి చెప్పాల్సిందే. రోగానికి వైద్యం కావాలని వచ్చిన వారు క్యూలైన్లలో వేచి ఉండి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తర్వాత, ఒటిపి వస్తే తప్ప వైద్యం అందించరు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఆన్‌లైన్ నిబంధనతో ముఖ్యంగా వృద్ధులు, గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు ముందుగా పేరు నమోదు చేసుకోవడం తప్పనిసరి. గత నెల 30వ తేదీ వరకు ఈ విధంగా నమోదు చేసేవారు. ఈనెల ఒకటో తేదీ నుంచి కొత్త ప్రక్రియను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకు వారి ఆధార్‌తో లింక్ అయిన మొబైల్‌కు ఒటిపి వస్తుంది. ఈ ఒటిపిని ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఎబిహెచ్) అనే యాప్‌లో ఎంటర్ చేసి, పేరు, వయసు, ఊరు, చిరునామా, పిన్‌కోడ్ నంబరుతో సహా సమగ్రంగా అందిస్తే ఒపి రిజిస్ట్రేషన్ అవుతుంది. ఆస్పత్రిలో మొబైల్ నెట్‌వర్క్ ఇబ్బందులున్న ఒక్కోసారి ఒటిపి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ ప్రక్రియపై అవగాహన లేని గ్రామీణ ప్రజలు, వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రతిరోజూ సుమారు 600 నుంచి వెయ్యి మంది వరకు అవుట్‌పేషెంట్లు వస్తుంటారు. సీజనల్ వ్యాధుల సమయంలో ఈ సంఖ్య పెరుగుతుంది. ఒటిపి ద్వారా ఒపి అందుకోవాలంటే నంబరు జనరేట్ కావడానికి ఒక్కోసారి సమయం పడుతుంది. ఆ తర్వాత ఒపి నమోదు క్రమసంఖ్య అక్కడున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లకు చెప్పాలి. వారు తిరిగి నమోదు చేసి ఒపి స్లిప్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియ తెలియక ఆసుపత్రికి వస్తున్న రోగులు అష్టకష్టాలు పడుతున్నారు.

ఒటిపి కోసం మెడికోలు, స్టాఫ్ నర్సుల సాయం

ఎబిహెచ్ఎ యాప్‌లో వివరాల నమోదుకు రోగులు కొంతమంది మెడికో విద్యార్థులు, స్టాఫ్ నర్సులు, నర్సింగ్ విద్యార్థులను ఆశ్రయిస్తున్నారు. వారికి తీరిక ఉంటే తప్ప నమోదు సాధ్యం కావడం లేదు. ఎబిహెచ్ఎ యాప్‌లో రోగి వ్యక్తిగత ఫోన్ నంబరుతో లాగిన్ కావడం, ఆ నంబరుకు వచ్చే ఒటిపిని నమోదు చేస్తే తప్ప వివరాలు నమోదు కాకపోవడంతో నిరక్షరాస్యులు, వృద్ధులు కొన్ని సందర్భాల్లో వెనుదిరుగుతున్న పరిస్థితులు ఉన్నాయి.



ఒటిపి కోసం వృద్ధులకు సాయం చేస్తున్న నర్సులు

ఆయుష్మాన్ భారత్ యాప్‌లో నమోదు

రిమ్స్ ఆస్పత్రిలో ఒపి సంఖ్య గణనీయంగా పెరిగింది. వారికి తగ్గటుగా ఒపి స్లిప్ సకాలంలో ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ అమల్లో భాగంగానే ఒటిపి విధానం అమలు చేస్తున్నాం. ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్ అయి ఉంటే వైద్యం కోసం వచ్చే రోగులకు ఒటిపి వచ్చిన వెంటనే వారి పూర్తి డేటా వచ్చేస్తుంది. కొత్త విధానానికి అలవాటు పడడానికి కొంత సమయం పడుతుంది. ఇబ్బందులను అధిగమించి ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం. రోగులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- స్వామినాయుడు
సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి



విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వెల్ఫేర్ స్టాంపును ఉపసంహరించుకోవాలి

- బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యారావు
- న్యాయవాదులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్, టెక్కలి, ఆమదాలవలస, పొందూరు

కోర్టు పిటిషన్లపై రూ.20 వెల్ఫేర్ ఫండ్ స్టాంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు డిమాండ్ చేశారు. వెల్ఫేర్ ఫండ్ స్టాంపు అమలును నిరసిస్తూ జిల్లాలోని పలు కోర్టుల్లో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని జిల్లా కోర్టు వద్ద చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బార్ కౌన్సిల్ తీసుకున్న స్టాంపు నిర్ణయం వల్ల కక్షిదారులకు న్యాయం అందుబాటులో ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం కూడా విధులను బహిష్కరించనున్నట్లు తెలిపారు.

టెక్కలిలో కోర్టు వద్ద న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని బార్ ఆసోసియషన్ అధ్యక్షులు డి.వివేకానంద డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పేడాడ బాబూరావు, బెండి గౌరీపతి, పి.సాయిరాజ్, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి మాట్లాడుతూ న్యాయవాదులు రూ.20 వెల్ఫేర్ స్టాంప్‌ను ఎటువంటి పిటిషన్లపైనా అతికించవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు పైడి వరాహనరసింహం, తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహనరావు, వి.రాజేశ్వరరావు, జి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరులోని సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని నిరసిస్తూ గురువారం పొందూరు సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా రాజాం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.మంజుల మాట్లాడుతూ ప్రతి పిటిషన్‌పై అతికించాల్సిన స్టాంపు మొత్తాన్ని ఏకపక్షంగా పెంచడం సరికాదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బ్రహ్మాజీ, కిరణ్, రంగారావు, అశోక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నుంచి కొత్త కలెక్టరేట్‌లో పాలన

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన కలెక్టరేట్ (ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్)లో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి పాలనా వ్యవహారాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గురువారం కొత్త కలెక్టరేట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ నిర్మాణం తుది దశలో ఉందని, సివిల్ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ స్వయంగా పర్యటించారని, జిల్లా మంత్రుల చొరవతో సుమారు రూ.7.5 కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయని చెప్పారు. ఆర్అండ్‌బి ఎస్ఇ పర్యవేక్షణలో పనిచేస్తున్న కాంట్రాక్టు సంస్థ ఈ డిసెంబరు నాటికి కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు తుదిరూపు తెస్తామని హామీనిచ్చిందన్నారు. డిసెంబరు నాటికి గ్రౌండ్‌ఫ్లోర్, ఫిబ్రవరి నాటికి మొత్తం భవనం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఏడెనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన పాత కలెక్టరేట్ స్థానే జిల్లాల పునర్విభజన తర్వాత అవతరించిన శ్రీకాకుళం జిల్లాలో అన్ని శాఖలు ఒకే చోటకు వచ్చినట్లవుతుందన్నారు.

ప్రతి వారం సమీక్షిస్తా

అంతకుముందు కలెక్టర్ నూతన కలెక్టరేట్‌లోని పలు బ్లాకులను సందర్శించారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. పనులు అత్యంత నాణ్యతా ప్రమాణాలతో వేగంగా చేయాలని కాంట్రాక్టు సంస్థకు చెప్పారు. సెంట్రలైజ్డ్ ఎసి, మరుగుదొడ్ల నిర్వహణ, పార్కింగ్ సౌకర్యాల గురించి పలు సూచనలు చేశారు. ఆయా డిపార్ట్‌మెంట్లకు వేర్వేరు కరెంట్ మీటర్లను అమర్చాలని సూచించారు. నాగావళి నదికి కలెక్టరేట్‌కు మధ్యలో కాంక్రీటు ఫ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రధాన పోర్టికోకు రహదారి అనుసంధానం పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ ముందు భాగంలో ల్యాండ్ స్కేపింగ్ చేసి, వంద మీటర్ల ఎత్తయిన పోల్ ఏర్పాటు చేసి, జాతీయ జెండా ఎగిరేలా తీర్చిదిద్దాలని సూచించారు. కలెక్టరేట్ లోపలి గోడలపై జిల్లా గొప్పదనాన్ని తెలిపేలా పెయింటింగ్స్ వేయించాలన్నారు. కచ్చితమైన నెట్‌వర్క్ వ్యవస్థతో 200 మందికి సరిపడేలా పెద్ద సమావేశ మందిర నిర్మాణం రానున్న రెండు నెలల్లోపే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రహదారులు, భవనాల శాఖ ఎస్ఇ జాన్ సుధాకర్, ఇఇ రవినాయక్, డిఇ సాగర్, ఎఇ పి.టి రాజు, సైట్ ఇన్‌ఛార్జి ప్రసాద్ చౌదరి తదితరులున్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సిద్ధార్థజైన్, ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- రణస్థలం

ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి, గ్రామ, వార్డు సచివాలయ కమిషనర్ సిద్ధార్థజైన్ అన్నారు. మండలంలోని తెప్పలవలసలో గురువారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీటు కౌంటరు, ల్యాబ్ టెస్టింగ్ కౌంటరు, మందుల పంపిణీ కౌంటరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్షలో అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలను ఆరోగ్యవంతులని చేయడమే లక్ష్యమన్నారు. ఇంటి వద్దకే వచ్చిన వైద్య సిబ్బందికి సహకరించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1.62 కోట్ల కుటుంబాలు ఆరోగ్యవంతంగా ఉండాలన్న ధ్యేయంతో 45 రోజుల పాటు 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు.

ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను నిపుణులైన వైద్యులతో గుర్తించి, వారికి చికిత్స చేయించనున్నామన్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికల ఆధారంగా రోగులకు చికిత్స అందించడమే కాకుండా ఇంకా ఏవైనా వ్యాధులు ఉంటే మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేయనున్నామని చెప్పారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, ఎంపిడిఒ రమణమూర్తి, వైద్యులు కృష్ణచైతన్య, సుమన్, గిరిబాబు, రజని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమాలను ప్రశ్నిస్తే అరెస్టులు

ఆమదాలవలస : ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద పొందూరు మండల టిడిపి నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు నేను సైతం బాబు కోసం 26వ రోజు రిలే నిరాహార దీక్షలో గురువారం పాల్గొన్నారు. టిడిపి పొందూరు మండల అధ్యక్షుడు చిగురుపల్లి రామ్మోహన్‌కు రవికుమార్ నిమ్మరసం ఇచ్చి గురువారం దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పరిపాలన కుంటుపడిందన్నారు. ఉద్యోగుల జిపిఎఫ్ రూ.30 వేల కోట్లు మహిళా సంఘాల సభ్యుల అభయహస్తం పథకం కింద దాచుకున్న రూ.నాలుగు వేల కోట్లను దోచుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. ఇసుక, మద్యం ఇలా అన్ని రంగాల్లో దోచుకోవడమే జగన్మోహన్ రెడ్డి పనిగా పెట్టుకున్నారన్నారు. నాడు-నేడు పనుల్లో అవినీతి పెచ్చుమీరిందన్నారు. పొందూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాలిశెట్టి వెంకటరావును స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటికి పిలిపించి రూ.12 లక్షల చెక్కులపై సంతకాలు చేయించుకుని తీసుకున్నారని తెలిపారు. నాడు-నేడు పనులకు తమ్మినేని సీతారాంకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్షమించేది లేదని ఒకపక్క తమ్మినేని సీతారాం చెప్తారని, మరోవైపు ఆ పార్టీ నాయకులే ఎరుకులపేట, దల్లవలస, వి.ఆర్ గూడెం ఇలా ప్రతి గ్రామంలో భూములను ఆక్రమించి అనధికార కట్టడాలు చేపడుతున్న విషయం తమ్మినేనికి తెలియదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయాలపై ఇంటింటి ప్రచారం


వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన విజయాలపై ప్రజలకు అవహగాన కల్పించేందుకు ఇంటింటి ప్రచారం చేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాను స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రతిపక్ష పార్టీల ఆరోపణలను సాధించిన విజయాలతోనే గట్టిగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి అనే అంశంపై పార్టీ మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులతో స్థానిక కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఏ ఇంటినీ విడిచిపెట్టకుండా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఒక దఫా ప్రజలను నేరుగా కలిశామని, అప్పుడు వారికి ప్రభుత్వం తరుపున అందిన లబ్ధి గురించి చెప్పామన్నారు. ఈసారి ప్రతిపక్షాలు చెప్తున్న అబద్ధాలు, అసత్యాలు, ఒంటరిగా పోటీ చేయలేక సాగిస్తున్న కుయుక్తుల గురించి వారికి విడమరచి చెప్పాల్సి ఉందన్నారు. రానున్న నాలుగు నెలల సమయం కీలకమని చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికి మళ్లీ మళ్లీ తెలియజేసే కార్యక్రమమే ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలో తెలిపే కార్యక్రమమన్నారు. సమావేశంలో బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మురళీధర్, పార్టీ నాయకులు చింతు రామారావు, బార్ల వేణుగోపాల్, కోరాడ చంద్రభూషణ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

హిట్ అండ్ రన్ కేసులో వాహనాలు గుర్తించేందుకు అవసరమైన సిసి కెమెరాలను ముఖ్యమైన కూడళ్లలో ఏర్పాటు చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ముందుగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. శ్రీకాకుళం నగరం కేంద్రంగా ఉన్న ట్రాఫిక్ పాయింట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిని గుర్తించి జరిమానాలు వేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడేపే వారిపై ప్రత్యేక దృష్టిసారించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దర్యాప్తు పెండింగులో ఉన్న ప్రతి కేసును పరిష్కరించాలన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ పాయింట్లు పెంచి ప్రమాదాలు సంభవించకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న చోట బారికేడ్లు ఏర్పాటు చేసి, అతి వేగ డ్రైవింగ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి సురక్షిత ప్రయాణానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో, సరైన వాహన పత్రాలు లేక పట్టుబడిన వాహనాలను కోర్టు ఆదేశాల మేరకు వీలైనంత వేగంగా డిస్పోజల్ చేయాలని సూచించారు. ఆమె వెంట ట్రాఫిక్ డిఎస్‌పి ప్రసాదరావు, ఎస్ఐ రమణ, ఎస్‌పి సిసి శివకుమార్ ఉన్నారు.


ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు చాకిపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వైఎస్ఆర్ కడప జిల్లా మేధా డిఫెన్స్ అకాడమీ మైదుకూరులో జరగబోయే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్-17 పోటీలకు జిల్లా ఉన్నత పాఠశాల చాకిపల్లి నుంచి ఇద్దరు, పదో తరగతి చదువుతున్న బొమ్మాళి, బొంగు లహరిలు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ గురువారం తెలిపారు. ఈ విద్యార్థుల ఎంపికపై పి.జగదీశ్వరరావు, కె.దాలయ్య, కె.నారాయణరావు, కె.మురళీకృష్ణ, పి.చిన్నారావు, పి.రుషి, బి.ఆనందరావు, ఆర్.జ్యోతి, కె.సుధారాణి, సిహెచ్.భారతి, టి.వైకుంఠరావు, ఎం.మోహిని, వ్యాయామ ఉపాధ్యాయుడు బాడన నారాయణరావు, పిఇటి రమేష్, క్రాంతి పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఆంగ్ల అధ్యాపక అతిధి పోస్టుకు ఉన్నత విద్యా కమిషనర్ ఆదేశాలు మేరకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్‌పాడి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 6 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాల వద్ద అందించాలన్నారు. ఆంగ్ల బాషలో పిజి చేసి 55 శాతం పైబడి మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, పిఇచ్‌డి డిగ్రీ ఉతీర్ణులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలో ఇంటర్వ్యూకు, డెమో క్లాస్‌కు హాజరుకావాలన్నారు. కళాశాల ఎంపిక కమిటీ నిర్ణయాల మేరకు అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న మురళీకృష్ణంనాయుడు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

సోంపేట: వన్యప్రాణుల సంరక్షణ మన అందరి బాధ్యత అని కాశీబుగ్గ రేంజ్ ఆఫీసర్ మురళీకృష్ణంనాయుడు అన్నారు. మండలంలోని ఎర్రముక్కం ఉన్నత పాఠశాలలో గురువారం వన్యప్రాణుల వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వన్యప్రాణుల చట్టం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వై.రాజేంద్ర, ఆర్.సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో ఇంటింటికీ వైద్యం

లావేరు : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని గురుగుబిల్లు గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, మాజీ ఎంపిపి రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, ఎంపిడిఒ కుప్పలి సురేష్ కుమార్, వైద్యాధికారులు సౌమ్య, జగదీష్ కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఇంటింటికీ వెళ్లి వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలో మేఘవరం పంచాయతీ బొరిగిపేటలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, మాజీ ఎంపిపి సంపతరావు రాఘవరావు డాక్టర్ హైందవి మోహన్, ఎంపిపి ప్రతినిధి రాహుల్, ఎంపిడిఒ లక్ష్మీబాయ్, తహశీల్దార్ ప్రవల్లికాప్రియ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని బెండి సచివాలయం వద్ద నిర్వహించిన ఆరోగ్య సురక్షలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు హనుమంతు వెంకటరావుదొర పాల్గొన్నారు. వైద్యులు దువ్వాడ దివ్య, కె.ప్రత్యూష, గీతిక, శ్రీలక్ష్మిలు 322 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో ఇసిజి, నేత్ర,కిడ్నీ, సాధారణ పరీక్షలు చేశారు. అందులో పది మందికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపిఇప ప్రతినిధి తమ్మినేని శాంతారావు, ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని మర్రివలసలో ఆరోగ్య సురక్షను వైసిపి నాయకులు బి.లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 225 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 15 మందికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు.


లావేరు : వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఈ సురక్ష శిబిరంలో అచ్యుతాపురం వైద్యాధికారిని పి.సుజాత, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : మండలంలోని రంగోయిలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సునీల్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ విజయ్, సర్జరీ డిపార్ట్‌మెంట్ వైద్యులు వెంకటేష్, దేవి 354 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు 51 మంది, రక్తహీనతతో 78 మంది, నేత్రాలకు సంబంధించిన వ్యాధులు 84 మంది, మూత్ర సంబంధ వ్యాధులు 120 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, శ్యామలాదేవి, సత్యవతి, రామారావు, కామేశ్వరరావు గోపాలరావు, చిన్నారావు తేజస్విని, రాణి, ప్రభ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసాన పంచాయతీలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో టెక్కలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దువ్వాడ వాణి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, సర్పంచ్ బోనేల పావని, బొనెల ఎల్లయ్య, బలగ సూర్యారావు, దండాసి సింహాచలం పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని సోమరాజుపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో నియోజకవర్గ వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు పాల్గొని మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో రక్త, బిపి, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ ప్రతినిధి మధుసూదనరావు, కలమట తిరుపతిరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం కొత్తలింగుడు పంచాయతీలో నిర్వహించిన ఆరోగ్య సురక్షను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంత ˘రం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, సర్పంచ్‌లు టి.నారాయణ, జీరు బాబూరావు పాల్గన్నారు.

బూర్జ: మండలంలో అప్పలపేట గ్రామ సచివాలయ నిర్వహించిన ఆరోగ్య సురక్షలో జడ్‌పిటిసి రామారావు, రాష్ట్ర టిడ్కో డైరెక్టర్ కె.గోవిందరావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, వైద్యాధికారులు రాజశేఖర్, రోజా, వాణిశ్రీ, రిమ్స్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ అనూష, మండల ప్రత్యేక ఆహ్వానితులు కె.నాగేశ్వరరావు, బొడ్డేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలం కృష్ణాపురంలో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన ఆరోగ్య సురక్షలో 326 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, వైసిసి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి ఛైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైద్యాధికారులు జి.రమేష్‌నాయుడు, శివశంకర్, మేరీ ఇందిర, రజనీ, సిహెచ్ఒ సుగుణ మ్మ, సూపర్‌వైజర్ గౌరినాయుడు పాల్గొన్నారు.


పొందూరు : మందులను పంపిణీ చేస్తున్న నాయకులు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

సజావుగా అంగన్వాడీల ఇంటర్వ్యూలు

టెక్కలి : టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిధి టెక్కలి, సారవకోట, కోటబొమ్మాళి, పాతపట్నం, కొత్తూరు, ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా నున్న 27 వివిధ రకాల అంగన్వాడీ పోస్టులకు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తన ఛాంబర్‌లో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 5 అంగన్వాడీ కార్య కర్తలకు, 11 హెల్పర్లకు, ఒకటి మినీ అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టారు. ఐసిడిఎస్ పరిధిలో అమలవు తున్న పథకాల నిర్వహణ, గర్భిణులపై, బాలింతలపై తీసుకోవాల్సిన చర్యలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబాట్టారు. ఇంటర్వ్యూలో ఐసిడిఎస్ పీడీ శాంతశ్రీ డిప్యూటీ డిఎండిహెచ్ఒ ప్రసాదరావు, ప్రాజెక్టు పిఒలు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రమీల జెన్న

పలుచోట్ల శ్రీకాంత్ పర్యటన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో మెళియాపుట్టి, సుందరాడ గ్రామాల్లో తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్ గురువారం పర్యటించారు. ముందుగా మెళియాపుటికు చెందిన పరపతి జయమ్మ, చాట్ల అప్పారావు, బోను భూలోక ఇటీవల మృతి చెందంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే చల్ల శాంతారావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సుందరాడ మాజీ సర్పంచ్ ప్రమీల జెన్న ఆహ్వానం మేరకు ఆమె నివాసానికి వెళ్లారు. అనంతరం శ్రీకాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ రాజశేఖరరెడ్డి, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, గణపతి ప్రధాన్, బోసి రామారావు, ఎస్.గౌరీష్, కన్నబాబు, కృష్ణపండి, శంకర్ బరోడా, రవ్వల దుర్యోధన, వాబ జగన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

న్యూడెమోక్రసీకి రాజీనామా

పలాస :సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు చేస్తున్న ఆర్థిక ఆరాచకాలను పార్టీ రాష్ట్ర కమిటీ దృషికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోకపో వడంతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు బాలకృష్ణ, హేమమ్మ, కుసుమ, ఆర్.మాధవరావు, జగన్, అప్పయ్య తెలిపారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అమరుల పేరు చెప్పుకొని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ (చంద్రన్న వర్గం) జిల్లా కార్యదర్శి మాధవరావు భూదందాలు, ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఇతర ఆర్థిక ఆరాచాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కారణంగానే ఇటీవల నిర్వహించిన కుమారన్న, చంద్రమ్మ వర్ధంతి సభలను రెండు గ్రూపులుగా నిర్వహించుకోవాల్సి వచ్చిందని అన్నారు. పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి చిట్టిపాటి మాధవరావు గ్రూపు సభకు హాజరు కావడంతో నమ్మకాన్ని కోల్పోయామన్నారు. జుత్తు వీరాస్వామి, బైరు కూర్మారావు, కోసింటి సోమేశ్వరరావు, మామిడి భీమారావు, బదకల ఈశ్వరమ్మ, వినోద్, పాల్గొన్నారు.

పార్టీ నుంచి బహిష్కరణ

పార్టీ జిల్లా కమిటీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బాలకష్ణ, కుసుమ, హేమలను బహిష్కరిస్తున్నామని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. జుత్తు వీరాస్వామి అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర కమిటీ ఆమోదంతో బహిష్కరణ కొనసాగుతుందని తెలిపారు. కూర్మారావు, సోమేశ్వరరావు, ఈశ్వరమ్మ, వినోద్ పాల్గొన్నారు.


పాపారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ ఉద్యోగ విధి నిర్వహణలో భాగంగా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ముంజేటి పాపారావుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందని వినియోగదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు లఖినాన వెంకటాచలం, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ అన్నారు. కాశీబుగ్గలో శ్రీనివాస్ నగర్ టీచర్స్ కాలనీలో అంతర్జాతీయ టీచర్స్ డే సందర్భంగా పాపారావుకు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధ్యతగా పని చేసినప్పుడే అవార్డులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ గౌరవ అధ్యక్షులు బత్తిని ఓంకార్, ఉపాధ్యాయులు అంబాల కృష్ణారావు, దాసరి శ్రీనివాసరావు, దుంపల కృష్ణమూర్తి ,బోకర దుర్యోధన, గ్రీన్ సభ్యులు నూకల హేమసుందర్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు అండ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండకు చెందిన నందిగామ గణేష్ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. గణేష్‌కు ప్రభుత్వం నూతన పింఛను రూ.పది వేలు గురువారం మంజూరు చేసింది. దీనిని వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్టి గోపి పంపిణీ చేశారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో ఐజిబిసి ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పర్యావరణ పరిరక్షణోద్దేశంగా స్థాపించిన ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ విద్యార్థుల విభాగాన్ని టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభించారు. దీనిని విశ్రాంత ప్రొఫెసర్, విశాఖ చాప్టర్ ఐజిబిసి ఛైర్మన్ కె.లీలాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికి 12 విద్యార్థి విభాగాలు పనిచేస్తున్నాయన్నారు. వరదలు, ఇతర పర్యావరణ విపత్తుల్లో సైతం తట్టుకొనేలా భవన నిర్మాణాలు జరిగిందుకు అనుగునంగా నిర్మాణ సామగ్రి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వర్షపు నీటిని ఆదా చేయడం, అధిక నీటిని అడ్డంకులు లేకుండా ప్రవహించేలా నిర్మాణాలు చేపట్టడం వల్ల కొన్ని సమస్యలను అధిగమించొన్నని పేర్కొన్నారు. ఈ అంశాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్గించేందుకు ఐజిబిసి కృషి చేస్తుందన్నారు. తొలిసారిగా ఐజిబిసి నిబంధనలకు లోబడి హైదరాబాద్‌లో నిర్మాణమైన భవనాన్ని భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం ప్రారంభించారని గుర్తుచేశారు. ఐతమ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు చొరవను అభినందించారు. ఐజిబిసి విశాఖ చాప్టర్ సహాయ ఛైర్మన్ డాక్టర్ కె.కుమార్‌రాజా బిజిబిసి లక్ష్యాలు, ఆవస్యకత, భవిష్యత్ తరాల మనుగడ అనే అంశాలపై మాట్లాడారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే చాలా ఇంజినీరింగ్ కళాశాలల్లో కోర్ కోర్సులైన సివిల్, ఇఇఇ మెకానికల్లను ఎత్తివేశారని, కోర్ కోర్సులున్న అతితక్కువ కాలేజీల్లో ఐతమ్ ఒకటని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, పలువురు డీన్లు, హెచ్‌డిలు, సివిల్, విభాగ అసిస్టెంట్ హెచ్ఐడి జి.డి.ఆర్.నాయుడు పాల్గొన్నారు.

అధికారం కోసం నాటకాలాడిందెవరు?

మంత్రి ధర్మానకు 'గుండ' దంపతుల ప్రశ్న

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందు అధికారం కోసం ఎవరు నాటకాలను ప్రదర్శించారో ప్రజలకు తెలుసని, చిన్నాన్న హత్య, కోడి కత్తి డ్రామాలతో ప్రజలకు నమ్మించిందెవరని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు ప్రశ్నించారు. గురువారం నగరంలోని అరసవల్లిలో వారి స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. గార మండలం వమ్మరవల్లి సభలో మంత్రి ధర్మాన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. సానుభూతి కోసం డ్రామాలు ఆడాల్సిన అవసరం టిడిపికి లేదన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి నిర్భందించిన వైసిపి నాయకులు వివేకానంద రెడ్డి హత్య కేసులోను, కోడి కత్తి కేసులో ఎందుకు తప్పించుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా పని చేసిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల చంద్రబాబు పట్ల సహజ న్యాయ సూత్రాలకు అనువైన రీతిలో వ్యవహరించడం లేదన్నారు. డ్రామాలాడుతున్నారనే నైతిక హక్కు ధర్మానికి లేదన్నారు. ధర్మాన నీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గురివింద చందంగా వైసిపి నాయకుల విమర్శలున్నాయన్నారు. సుదీర్ఘ కాలం ప్రజానాయకునిగా ఉన్న చంద్రబాబుకు జైలు జీవితం గడిపిన వైసిపి నాయకులకు పోలికేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా చవుక బారు రాజకీయాలు మానాకోవాలని హితవు పలికారు.


మాట్లాడుతున్న 'గుండ' దంపతులు

కట్యాచార్యులపేటలో గ్రామసభ

ఆమదాలవలస : ఉపాధి హామీ చట్టంతో వలసలను నివారించవచ్చునని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. గురువారం మండలంలోని కట్యాచార్యులపేట పంచాయతీలో ఉపాధి హామీ పనులపై గ్రామసభను సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ పరిధిలోని పనులను గుర్తించడానికి గ్రామసభ ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. రైతులకు అవసరమయ్యే వ్యవసాయ రంగానికి సంబంధించిన చెరువులు, కాలువలు, మధుములు అలాగే గ్రామానికి అవసరమయ్యే ఉపాధి పనులను చేపట్టడం వలన ఉపాధిహామీ వేతనదారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వలసలు తగ్గి గ్రామంలోనే ఉపాధి లభిస్తుందన్నారు. చెరువుల్లో పనులు చేపట్టడంతో నీటి నిల్వలు పెరిగి చెరువులు కళకళలాడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ రామచంద్రరావు

బీజామృతంతో విత్తనశుద్ధి

కోటబొమ్మాళి: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడంతో పంటకు సంక్రమిస్తున్న తెగుళ్ల నివారణకు ఉపయోగపడుతుందని సెంచూరియన్ విద్యార్థులు ఎల్.యుగంధర్, ఎం.జీవన్, డి.దేవానంద్‌లు అన్నారు. స్థానిక సంతమట్టి వద్ద బీజామృతంతో విత్తనశుద్ధిపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పొలంలో విత్తనాలను విత్తుకోవడానికి ముందు బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం ఎంతో ముఖ్యమని అన్నారు.


విత్తనశుద్ధి చేస్తున్న విద్యార్థులు

అభిరుచులకు తగ్గట్టు వ్యాపారాలు

శ్రీకాకుళం అర్బన్ : ప్రజల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన ఆహార పదార్థాలను అందించి వ్యాపారాభివృద్ధిని సాధించాలని రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన షఫ్రాన్ హోటల్‌ను మాజీ కేంద్ర మంత్రి డాక్టరు కిల్లి కృపారాణి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా యాజమాన్యానికి ఆయన శుబాకాంక్షలు తెలిపారు. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోటీకి తగ్గట్టు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని పొందడం ద్వారానే అబివృద్ధి సాదించగలరన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో పాటు నగరంలోని పలువురు వ్యాపారులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న కృపారాణి


శిక్షణ పొందిన విద్యార్థులతో పరిశ్రమ ప్రతినిధులు

ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలి

ప్రజాశక్తి- రణస్థలం

విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి అటు కుటుంబాలకు, ఇటు సమాజానికి ఉపయోగపడేలా క్రమశిక్షణతో నడుచుకోవాలని అరబిందో పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్పొరేట్ హెచ్‌ఆర్ డిపార్ట్మెంట్ యుఎన్‌బి.రాజు అన్నారు. మండలంలోని వరిసాం పంచాయతీ అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ఎంఎస్‌సి చదివిన విద్యార్థులకు 'ఫార్మాసిటీకాల్ క్వాలిటీ కంట్రోల్ అనలైటికల్ టెక్నిక్స్" పై నాలుగు నెలల ఉచిత శిక్షణ అందించారు. ఈ శిక్షణకాలం ముగిసిన సందర్భంగా ఆ బ్యాచ్ 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానోత్సవ కార్యక్రమం గురువారం పైడిభీమవరం అరబిందో పరిశ్రమలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఉద్యోగులు, అరబిందో పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొదుపు నిధులు వినియోగించుకోవాలి

ఇచ్ఛాపురం: ప్రతి సంఘంలోని పొదుపు నిల్వలను తప్పనసరిగా ఉపయోగించుకోవాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మండలంలోని తెలుకుంచిలో మహిళా సంఘాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం అంతర్గత పొదుపు, గ్రామ సంఘంలో అప్పు, స్త్రీనిధి ద్వారా అప్పు, ఇవి కాకుండా ఇంకా అవసరం ఉన్నప్పుడు బ్యాంకు ద్వారా రుణం పొందాలన్నారు. ప్రభుత్వ పథకాలు, వైఎస్ఆర్ ఆసరా, స్త్రీనిధి ఇన్సూరెన్స్, లోక్ అప్‌లో సభ్యులు డేటా, ఆన్‌లైన్ పుస్తకాల నిర్వహణ ఉండాలన్నారు. సంఘ సభ్యులు వాడుకునే రుణాలు ఏ అవసరాలకు ఉపయోగిస్తున్నారు, ఎటువంటి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు, దీని ద్వారా సంఘాలకు ఎంత లాభం అన్న విషయాలు వివరించారు. అలాగే రుణం పొందుతున్న సంఘ సభ్యుల రికార్డులు అందరి సమక్షంలో పరిశీలించి వివరాలు రాబట్టారు. విఒ అధ్యక్షులు పార్వతి, కృష్ణవేణిపాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ముగిసిన నాక్ బృందం పర్యటన

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం పరిశీలన గురువారంతో ముగిసింది. రెండో రోజూ జాతీయ సేవా విభాగం ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలు, విద్యార్థుల భాగస్వామ్యం వంటి అంశాలను పరిశీలించారు. విద్యార్థుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన క్లబ్‌ని పరిశీలించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి కళాశాల అభివృద్ధిలో తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు ఇచ్చారు. నాక్ బృందంలో కర్నాటక రాష్ట్రం హసన్ యూనివర్సిటీకి చెందిన వైస్ ఛాన్సలర్ టి.సి.తారాన్త్, రాజస్థాన్ రాష్ట్రం సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన నాగేంద్ర అంబేద్కర్ సోల్, కావేరి ఉమెన్స్ కళాశాలకు చెందిన అధ్యాపకులు వి.సుజాతలు ఉన్నారు. ఆనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మతో ఎగ్జిట్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ ఎఇ రామారావు, కందిగోల్ల, లీలామద్మజ పాల్గొన్నారు.



నాక్ బృందంతో కళాశాల అధ్యాపకులు

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మండలం బొప్పాయిపురం జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్వీచక్ర వాహనం దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే... సారవకోట మండలానికి చెందిన ఓ వ్యక్తి దిచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై ఒక్కసారిగా కుక్క అడ్డం వచ్చింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో బైక్ రాసుకుంటూ కొద్ది దూరం వెళ్లింది. వెంటనే బైక్ నుంచి మంటలు చెలరేగాయి. అందరూ చూస్తుండగానే బైక్ బూడిదైంది. వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.


దగ్ధమవుతున్న బైక్




శ్రీరామ్మూర్తి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- కంచిలి

కంచిలి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కరణి శ్రీరామ్మూర్తి (48) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ్మూర్తి గురుకుల పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి టిఫిన్ తెచ్చేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. పబ్జి ధాబా సమీపంలో వాహనం అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో శ్రీరామ్మూర్తి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని విద్యార్థి ఆత్మహత్య

ఆమదాలవలస : పట్టణంలోని పూజారిపేటలో నివాసం ఉంటున్న బాడాపు పవన్ కళ్యాణ్(15) తల్లి దమయంతి మందలించిందన్న మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు పవన్ కళ్యాణ్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తున్నాడు. పవన్ కళ్యాణ్‌కు మొదటి నుండి చదువు మీద ఆసక్తి ఉండేది కాదు. డ్యాన్స్‌పై ఎక్కువ ఆసక్తి చూపేవాడని, దీంతో తల్లి తరచూ మందలిస్తూ తలుపులు వేసి ఇంట్లోకి విద్యార్థిని రానిచ్చేది కాదని స్థానికులు తెలుపుతున్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న గణేష్ నిమజ్జనంలో పాల్గొని డిజె పాటలకు స్టెప్పులు, డాన్సులు వేసి ఇంటికి 10 గంటల సమయంలో వచ్చి తలుపులు కొట్టాడు. తల్లి చదువుకోకుండా ఎప్పుడూ తిరుగుతూ కాలం వెళ్లదీస్తున్నావని మందలించి తలుపు తీయకపోవడంతో పవన్ కళ్యాణ్ మనస్థాపం చెంది బాత్రూం వద్ద సీలింగ్ ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి 11 గంటల సమయంలో తండ్రి బాడాపు సూర్యనారాయణ ఇంటికి చేరుకునేసరికి కుమారుడు వేలాడుతుండడం చూసి బోరున విలపించి అక్కడ నుండి తన స్వగ్రామమైన సరుబుజ్జిలి మండలం అలమాజీపేటకు బుధవారం రాత్రి మృతదేహాన్ని తరలించినట్లు స్థానికులు తెలిపారు. విద్యార్థి మృతి వార్త తెలుసుకున్న కళాశాల అధ్యాపకులు గురువారం సంతాపం తెలిపి సెలవును ప్రకటించారు. పవన్ కళ్యాణ్ కళాశాలలో అందరితో సరదాగా కలివిడిగా ఉండేవాడని, ఇంతలో ఇలా మృతి చెందడంతో అధ్యాపకులు, విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.


పవన్ కళ్యాణ్ (ఫైల్)

వివాహిత ఆత్మహత్యాయత్నం

కంచిలి: మండలంలోని జాడుపూడికు చెందిన నల్ల లీజారాణి సాహూ (31) బుధవారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. లీజారాణి సాహూ 11 ఏళ్ల క్రితం చక్రధర చౌదరితో వివాహమైంది. వీరికి కుమారు, కుమార్తె ఉన్నారు. పెళ్లయిన నాటి నుంచి భర్తతోపాటు అత్త అదనపు కట్నం, బంగారం కోసం నిత్యం వేధిస్తూ ఉండేదని బాధితురాలు తరచూ తల్లిదండ్రులకు చెబుతుండేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి భర్తకు చెందిన బంగారు గొలుసు ఆమె వేసుకోవడంతో ఘర్షణ జరిగింది. దీంతో ఆమె మనస్తాపానికి గురైన ఆమె మోటార్ వాహనం కోసం తెచ్చి ఉంచిన పెట్రోలు ఒంటిపై పోసుకొని నిప్పంటించుకుంది. భర్త చక్రధర్ ఆ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించే క్రమంలో అతడి చేతులకూ గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఆమెను సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. ఎస్ఐ బాలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఎఫ్ఎ-2 పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యాశాఖ ఆధ్వర్యాన రెండు రోజులుగా నిర్వహించిన ఎఫ్ఎ-2 పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లా విద్యాశాఖాధికారుల ద్వారా వాట్సాప్‌ల ద్వారా వచ్చిన ప్రశ్నపత్రాలను చూసి నల్లబల్లపై రాసి పరీక్షల నిర్వహణకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పలు అవస్థలు ఎదుర్కొన్నారు. రోజుకు రెండున్నర గంటల కాలవ్యవధిలో రెండు పరీక్షల నిర్వహణ కష్టతరంగా మారింది. బోర్డులపై ప్రశ్నపత్రాలు రాసినప్పటికే కొంత సమయం గడచిపోతుంది. మిగిలిన సమయంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు కొన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహణ జరుగుతుంది. ఇదిలా ఉండగా... అక్టోబరు నెల మొదటి రోజుల్లో పరీక్షల నిర్వహణ చేపట్టిన అధికారులు ప్రశ్నపత్రాల్లో ఆక్టోబరు నెల సిలబస్‌కు సంబందించిన పాఠ్యాంశాలు, ప్రశ్నలు ఇవ్వడం గమనార్హం. దీంతో పూర్తికాని సిలబస్ నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో గందరగోళ పరిస్థితులు పడాల్సిన పరిస్థితి. పరీక్షలు ముగిసినా, మూల్యాంకనం చేపట్టి ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దసరా సెలవుల ముందే ఈ ప్రక్రియ అంతా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ కాబడడంతో ఉపాధ్యాయులు మూల్యాంకనంపై దృష్టిసారించారు.


కమిషనర్ సిద్ధార్థ్‌జైన్‌కు సమస్యలు వివరిస్తున్న మధుబాబు

కమిషనర్‌ని కలిసిన మధుబాబు

ప్రజాశక్తి- రణస్థలం

మండలం తెప్పలవలస గ్రామ సచివాలయం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంకు జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి, సర్వే సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ కమిషనర్ సిద్ధార్ద్ జైన్ గురువారం హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వేలో కీలక పాత్ర వహిస్తున్న గ్రామ సర్వేయర్స్ తరపున ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధుబాబు, సర్వే శాఖ కమిషనర్ సిద్దార్థ్ జైన్‌ని కలిసి గ్రామ సర్వేయర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యల పట్ల వినతిపత్రం అందించారు. అనంతరం మధుబాబు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్ల గ్రేడ్-1 ఖాళీల వివరాలు ప్రకటించడం, వివిధ రీ సర్వే సంబంధిత సమస్యల కోసం ఒక్కొక్కటిగా కమిషనర్‌తో ప్రస్తావించారు. సర్వేయర్ల కమిషనర్ సిద్దార్థ్ జైన్ సానుకూలంగా స్పందించి కష్టపడి పని చేస్తున్న వారికి ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని, గ్రామ సర్వేయర్ల గ్రేడ్-1 ఫైల్ కోసం పూర్తి సమాచారంతో కార్యాలయానికి హాజరై వివరించాలని సూచించారు.

26న వెలమ గర్జన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సామాజికంగా మరింత అభివృద్ధి చెందడానికి వెలమకులాన్ని బిసి 'డి' జాబితా నుంచి బిసి 'ఎ' లోకి మార్చాలని ఎపి వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.గోవిందరావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రైయివేటు హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. వెలమ హక్కుల సాధన కోసం నవంబరు 26న విశాఖ నగరంలో గర్జన సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వెలమ సామాజిక భవనాలు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు ఇవ్వాలని కోరారు. దమాషా పద్ధతిలో రాజకీయాల్లో, సంక్షేమ పథకాల్లో చోటు కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్మథరావుతో పాటు సంయుక్త కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, తూర్పు గోదావరి జిల్లా నాయకులు గొల్లు శ్రీనివాస్, దుర్గారావు, గొర్లి రాము, స్వామి నాయుడు, ధనుంజయ పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసన దీక్ష


శ్రీకాకుళం అర్బన్: నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

పలాస: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రిమాండ్‌కు నిరసనగా కాశీబుగ్గలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో 24 రోజుకు చేరుకుంది. టిడిపి నాయకులు ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ దీక్షకు శిరీష సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, యవ్వారి మోహనరావు, సూరడ మోహనరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: చంద్రబాబ రిమాండ్‌కు నిరసనగా టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ ఆధ్వర్యాన స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ నాయకులు బాబుకు తోడుగా ఒక నియంత్రపై పోరాటానికి మేము సైతం అంటూ గురువారం సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఎంపిపిలు రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, మట్ట సుందరమ్మ, టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషు, సంతబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, టెక్కలి మండల మహిళా అధ్యక్షులు మెండ దామయంతి, నంబాళ్ల శ్రీనివాస్, గొండు లక్ష్మణరావు, దేవాది సింహాద్రి, బాడాన రవణమ్మ, రెడ్డి అప్పన్న, హనుమంతు అప్పలరాజు, మామిడి రాము, మోడి రామచంద్రరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : చంద్రబాబు అరెస్టును నిరశిస్తూ నగరంలోని 80అడుగుల రోడ్డులో టిడిపి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న నిరసన దీక్ష 23వ రోజుకు చేరింది. గురువారం చేపట్టిన దీక్షలో గార మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు. శిబిరాన్ని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వైసిపి అరాచక పాలన సాగిస్తోందని విమర్శించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబును అసలు ఆదారాలు లేని కేసుల్లో అక్రమ పద్ధతిలో అరెస్టు చేశారన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనం కోసం కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ వ్యవస్థలను సైతం భ్రస్టు పట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జల్లు రాజేవ్, పొట్నూరు కృష్ణ , మాదారపు వెంకటేష్, పిఎంజె బాబు, సింతు సుధాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


పలాస: ఒంటి కాళ్లపై నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు


కోటబొమ్మాళి : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

మణికంఠకు అభినందనలు

ప్రజాశక్తి- పోలాకి

8వ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు కర్నూలు జిల్లా మహానందిలో గత నెల 29 నుంచి ఈ నెల 2 వరకు నిర్వహించారు. ఈ పోటీలో జిల్లా బాల బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిలో నరసన్నపేట బిసి గురుకుల పాఠశాల విద్యార్థి ఎల్.మణికంఠ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈయనకు ఎమ్మెల్యే కృష్ణదాస్, జెడ్‌పిటిసి కృష్ణచైతన్య, రావులవలస సర్పంచ్ పల్లె బుల్లయ్య, ఎంపిటిసి పంచరెడ్డి సత్యం, ప్రిన్సిపాల్ అర్చన అభినందించారు.



రికార్డులను పరిశీలిస్తున్న కుమార్ రాజు

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి - మెళియాపుట్టి

స్థానిక శాఖాగ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయ నిర్వహణ, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ భవనం వర్షాలకు కారిపోయి పుస్తకాలు తడిసిపోతున్నాయని గ్రంథాలయ అధికారి అనురాధ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు ఆయన స్పందిస్తూ మరమ్మత్తులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాతపట్నం గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, చిరంజీవి ఆపల్గొన్నారు.


పింఛను అందిస్తున్న నాగమణి

విశాఖ వెళ్లి పింఛను అందజేత

కవిటి: కవిటి మండలం బి.జి.పుట్టుగ పంచాయతీకి చెందిన బడగల కళావతి అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా విశాఖపట్నంలో చికిత్స పొందుతోంది. దీంతో ఆమె తనకు ప్రతినెలా వచ్చే వితంతు పింఛను తీసుకునే అవకాశం లేకపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ వాలంటీర్ నాగమణి విశాఖ వెళ్లి కళావతికి పింఛను అందించింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బద్రి ప్రకాష్ నాగమణి వృత్తి నిబద్ధతకు అభినందనలు తెలిపారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానానికి మండలంలోని తాటిపర్తికి చెందిన తర్ర మాలతి ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణకు గురువారం రూ.55 వేలు చెక్కును విరాళంగా అందజేశారు. తన భర్త తర్ర అప్పన్న జ్ఞాపకార్థం ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానానికి విరాళం అందజేశానని తెలిపారు.

వాలంటీర్లు, గృహ సారథులే కీలకం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపి విజయానికి వాలంటీర్లు, గృహసారథలే కీలకమని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ అన్నారు. పట్టణంలోని ఆర్‌జె ఫంక్షన్ హాల్‌లో 'జగన్ ఎందుకు కావాలంటే...' ప్రచార సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ముందు జగన్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు 95 శాతం అంలు చేశారని అన్నారు. అన్ని తరగతుల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న జ్యోతికి రూ.50 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు పి.రాజశేఖర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు, వైస్ చైర్‌పర్సన్లు, పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబూరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిరాజ్

వర్మీకంపోస్టు పరిశీలన

లావేరు: వర్మీ కంపోస్టు ద్వారా తయారైన ఎరువుతో మంచి దిగుబడులు సాధ్యమని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గొర్లె అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అదపాకలో గురువారం సర్పంచ్ గొర్లె శశికళ అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామ సభలో అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటుచేసిన చెత్తనుంచి సంపద తయారు కేంద్రాల్లో తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు ఎరువులను రైతులు వినియోగించుకోవాలన్నారు. రసాయన ఎరువులు విడనాడాలని, సేంద్రియ ఎరువులనే ఉపయోగించాలన్నారు. టన్ను ఎరువు రూ.10వేలుకు లభ్యమవుతుందన్నారు. డిపిఆర్‌సి రాజేష్ మాట్లాడుతూ రైతులు ఈ వర్మీ కంపోస్టును వాడి తక్కువ పెట్టుబడులుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ఎంపిటిసి సత్యం, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనువాసరావు, మండల ఎంఆర్‌సి పొట్నూరు లక్ష్మునాయుడు, ఉపాధి టిఎ గౌరీనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సంక్షేమమే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రజలు సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డిను మరొకసారి ముఖ్యమంత్రిగా చేయాలని టెక్కలి నియోజకవర్గం దువ్వాడ వాణి అన్నారు. యస్ ఒన్ కన్వర్షన్ హాల్లో టెక్కలి మండల కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి ఎందుకు కావాలి జగనన్న ప్రజలకు అవసరమని వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్లా సరోజినమ్మ, పిఎస్‌సిఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, చింతాడ గణపతిరావు, పోలాకి సోమేశ్వరరావు, పేడాడ రమేష్, బగాది హరి, బెండి గౌరీపతి, శిగిలిపల్లి మోహనరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పెద్దలింగలవలస గ్రామానికి చెందిన లావేరు పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు మీసాల అప్పారావును ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం పరామర్శించారు అప్పారావు తల్లి మీసాల నారాయణమ్మ ఇటీవల మతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ అప్పారావును పరామర్శించి తన సంతాపాన్ని తెలిపారు.ఈయనతో పాటు మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు డి.రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసురావు, మండల ఉపాధ్యక్షుడు లుకలాపు శ్రీనువాసురావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఉన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

డిసిసిబి మేనేజర్ సంధ్యారాణి

ప్రజాశక్తి - ఆమదాలవలస

గ్రామీణ ప్రాంతంలో ముఖ్యంగా రైతులకు, మహిళలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డిసిసిబి మేనేజర్ సంధ్యారాణి తెలిపారు. గురువారం మండలంలోని తోటాడ, అక్కివరం గ్రామాల్లో రైతులు మహిళలకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసిసిబి బ్యాంక్ డిపాజిట్‌లపై మిగతా బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ రేట్లను చెల్లిస్తున్నట్లు వివరించారు. బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకే సకాలంలో రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా స్వయం శక్తి సంఘాలకు తమ పొదుపును సభ్యుల ఆమోదం మేరకు ఇంటర్నల్ లెండింగ్ చేసుకోవడానికి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణం నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ లావణ్య, బ్యాంకు సిబ్బంది శైలజ, లలితతో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, రామప్పడు విఒఎలు స్వప్న, రాజేశ్వరి, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిసిసిబి మేనేజర్ సంధ్యారాణి

జగన్ మళ్లీ సిఎం కావాలి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం మహి గ్రాండ్ హెూటల్‌లో నిర్వహించిన వై ఎపి నీడ్స్ జగన్ ఆంధ్రప్రదేశ్‌కి మళ్లీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మేలు జరిగి అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ కావాలంటే మళ్ళీ జగనే సీఎం కావాలని పేదలు, బడుగువర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు సంతోషంగా ఉన్నారంటే అది జగనన్న ఘనతేనన్నారు. అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలకు, కొన్ని వర్గాలకే పరిమితం కాకుండ రాజధాని వికేంద్రీకరణ, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, పోర్టులు, పరిశ్రమలు, ఐటీ రంగం, స్కూల్స్, ఆస్పత్రుల్లో నాడు-నేడు, జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి కావాలంటే మళ్లీ జగన్ సిఎం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కిరణ్‌కుమార్

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పేదలకు ఆకలి తీర్చాలన్న ఆలోచనతో డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నగరంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న పలు కుటుంబాలకు ఉచితంగా నిత్యావసర సరుకులను అందజేశారు. గురువారం ఈ సరకులను నేరుగా వారి ఇంటి వద్దకే చేర్చి కిట్లు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, అరసవల్లి పాలకమండలి సభ్యులు లుకలాపు గోవిందరావు హాజరై వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి హెల్పింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రభాస్ సూర్య అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తినిచ్చేవిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బరాటం చక్రవర్తి, విజయ్, చిన్న సహకారం అందించారు. కార్యక్రమంలో డాడీ హెల్పింగ్ ఫౌండేషన్ సభ్యులు నాగేంద్ర, చక్రి, ప్రసాద్, బుడి, సాయి, సీపాన రమేష్ కుమార్, శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ మణికంఠ పీపుల్ సేవ్ హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకులు పిడుగు నరేష్ పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న డాడీ హెల్పింగ్ ఫౌండేషన్



తండ్యాంలో విచారణ చేస్తున్న అటవీశాఖ అధికారులు

అటవీశాఖ అధికారుల విచారణ

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ, లావేరు మండలం కొత్తకుంకాం పరిధిలో జీడితోటలు, అటవీభూముల ఆక్రమణలపై గురువారం తండ్యాంలో అటవీశాఖ అధికారులు విచారణ జరిపారు. గతనెల 25వ తేదీన ఈ ఆక్రమణలపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో గ్రామస్థులు ఫిర్యాదు చేయడంపై జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు తండ్యాం సచివాలయంలో ఈ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ విచారణలో రణస్థలం డిఆర్ఒ అప్పలనాయుడు, ఎఫ్‌బిఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

షోషక లోపం నివారణకు కషాయం

ప్రజాశక్తి- లావేరు

వరి పంటలో పోషకాల లోపం నివారణకు జిల్లేడు కషాయంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాంబాబు, సోమశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తకుంకమ్ యూనిట్‌లోని లెక్ష్మినారాయణపురం గ్రామంలో సామూహికంగా కొంతమంది రైతులు వరి పొలాల్లో పసుపు ప్లేట్లు, పక్షి స్థావరాలు పెట్టడం, వాటి ఉపయోగాలపై వివరించారు. వరిలో అధికంగా పోషకాలు లోపం కనిపించిందని, నివారణకు జిల్లేడు కషాయం 40 లీటర్లు తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, ధనలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బలవర్థక ఆహారంతో బాలల ఆరోగ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బలవర్ధకమైన ఆహారం అందించడం ద్వారా బాలలు ఆరోగ్యవంతంగా ఉంటారని జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు హనుమంతు వెంకటరావు దొర అన్నారు. మండలంలోని బెండి సచివాలయం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. రుచికరమైన ఆహారం సక్రమంగా అందిస్తున్నామని అన్నారు. నాడు-నేడు కింద పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శాంతారావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ గంగమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, శ్రీదేవి పాల్గొన్నారు.


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వెంకటరావు దొర

ముక్కు మూసుకోవాల్సిందే

పాలకొండ: డంపింగ్ యార్డ్ సమస్య పాలకొండను తీవ్రంగా ఉంది. మేజర్ పంచాయతీ నుంచి కూడా ఈ సమస్య గుదిబండగానే ఉంది. డివిజన్ కేంద్రమైన పాలకొండ నగరపంచాయతీలో ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పట్టణ నడిబొడ్డునున్న వెంకటరాయ కోనేరు వద్ద చెత్తను డంప్ చేస్తున్నారు. 4వ వార్డుకు అతి సమీపంలో డంప్ చేయడంతో ఆ వార్డు పరిధిలో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ చెరువు మీదగా ఆసుపత్రితో పాటు పల్లు ప్రాంతాలకి వెళ్లే ప్రధాన రహదారి. దీంతో ఆ చెరువుపై నడవాలంటేనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమల బెడద కూడా ఎక్కువగానే ఉంది. కొన్ని నెలల క్రితం పట్టంలో కొత్త వీధి దగ్గర రెండు ఎకరాలు డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు. డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చుట్టూ పక్క ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సిరికొండలో డంపింగ్ యార్డుకు ఐదెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. స్థానికులు అడ్డుకొని కోర్టును ఆశ్రయించడంతో ఆ పనులు నిలిచిపోయాయి. దీంతో వెంకటరాయ కోనేరు దగ్గరే చెత్తను పోగులుగా వేస్తున్నారు.


పేరుకుపోయిన చెత్త